నీటిలో ఎగురుతూ విద్యుత్తు ఉత్పత్తి

లండన్, నవంబర్ 15: నీటి అలలతో విద్యుత్తును ఉత్పత్తి చేసే వేలాశక్తి(టైడల్ ఎనర్జీ) రంగంలో సరికొత్త ఆవిష్కరణ చోటు చేసుకున్నది. నీటిలో ఈదుతూ విద్యుత్తును ఉత్పత్తి చేసే 'టైడల్ కైట్'ను స్వీడన్‌కు చెందిన మినెస్టో అనే సంస్థ తయారుచేసింది. టర్బైన్‌తో ఉండే ఈ టైడల్ కైట్ పేరు 'డ్రాగన్ 12'. గాలిపటం ఆకాశంలో ఏవిధంగా ఎగురుతుందో, ఇది సముద్రంలో అదే విధంగా ఈదుతుంది. అందుకే దీనిని టైడల్ కైట్ అని పిలుస్తున్నారు. ఇది ఈదుతున్నప్పుడు నీటిలో ఎనిమిది సంఖ్య ఆకారాన్ని సృష్టిస్తుంది. దీంతో అలల ప్రవాహంలో శక్తి పెరిగి, వేలాశక్తిని ఉత్పత్తి చేసే టర్బైన్ సామర్థ్యం మెరుగవుతుంది. పవన విద్యుత్తుకు సమానంగా వేలాశక్తి ఉత్పత్తి అయ్యేలా టైడల్ కైట్స్ ఉపయోగపడతాయని మినెస్టో సంస్థ చెప్తున్నది. తక్కువ ఖర్చుతో వీటిని సముద్రంలోకి పంపించవచ్చని, నిర్వహణ కూడా సులభమని పేర్కొంటున్నది.

స్కామర్లకు చెక్ పెట్టే ఏఐ బామ్మ!

న్యూఢిల్లీ: ఇటీవలి కాలంలో ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్నాయి. ఈ సమస్య ప్రపంచ వ్యాప్తంగా ఉంది. వినియోగదారులకు కాల్ చేసి బురిడీ కొట్టించి కోట్ల రూపాయలు దండుకుంటున్న స్కామర్లకు చెక్‌పెట్టేందుకు యూకే టెలికం కంపెనీ 'ఓ2' ఏఐ బామ్మ 'డైసీ'ని సృష్టించింది. వినియోగదారులకు స్కామర్లు బురిడీ కొట్టించడం కాదు.. ఏఐ బామ్మే వారిని బుట్టలోకి దింపుతుంది. కుటుంబ విషయాలు, అవీఇవీ మాట్లాడుతూ వారి సమయాన్ని వృథా చేస్తుంది. తద్వారా ప్రజలు స్కామ్ కాల్స్ బారినపడకుండా కాపాడుతుంది. డైసీ సాధారణ చాట్‌బాట్ కాదు. అత్యంత అధునాతన ఏఐ సాంకేతికతతో దీనిని డిజైన్ చేశారు. ఇది అచ్చం మనిషిలానే మాటలు కలుపుతుంది. అవతలివారు చెప్పింది వినడమే కాదు.. అప్పటికప్పుడు వాటికి సమాధానాలు కూడా ఇస్తుంది. స్కామర్లు తాము నిజంగానే నిజమైన వ్యక్తితో మాట్లాడుతున్నట్టుగానే భ్రమపడేంతగా డైసీ ముచ్చట్లు చెప్తుంది. బ్రిటన్‌లో ప్రతి 10మందిలో ఏడుగురు స్కామర్లపై ప్రతీకారం తీర్చుకోవాలని అనుకుంటారని, కానీ సమయాన్ని వృథా చేసుకోవడం లేక మిన్నకుంటున్నట్టు పరిశోధనలో తేలింది. ఈ నేపథ్యంలో ఏఐ బామ్మ డైసీని సృష్టించారు. వారు తీర్చుకోవాలన్న ప్రతీకారాన్ని డైసీ తీర్చిపెడుతుంది. ఏకధాటిగా 40 నిమిషాల వరకు మాట్లాడి మోసగాళ్ల సమయాన్ని వృథా చేయగలదు. తద్వారా వినియోగదారులు స్కామర్ల బారినపడకుండా కాపాడుతుంది.

వివాహానికి రుణాలు

చెన్నై, నవంబర్ 15: ప్రీవెడ్డింగ్, సంగీత్, హల్దీ, మ్యారేజ్, రిసెప్షన్ అంటూ.. వివాహ ఖర్చులు విపరీతంగా పెరుగుతున్న వేళ మ్యాట్రిమొనీ.కామ్ సంస్థ సరికొత్త సేవలు ప్రారంభించింది. ఇంతకాలం పెండ్లి సంబంధాలు కుదుర్చుతున్న ఈ సంస్థ ఇక మీదట పెండ్లి ఖర్చుల కోసం రుణాలు ఇప్పించనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా 'వెడ్డింగ్‌లోన్స్.కామ్' అనే ఫిన్‌టెక్ వేదికను ప్రారంభించింది. ఐడీఎఫ్‌సీ, టాటా క్యాపిటల్, ఎల్ అండ్ టీ ఫైనాన్స్ వంటి సంస్థలతో తాము జట్టుకట్టామని, వీటి నుంచి వివాహాల కోసం రుణాలు ఇప్పిస్తామని మ్యాట్రిమొనీ.కామ్ సంస్థ సీఈవో మురుగవేల్ జానకిరామ్ శుక్రవారం తెలిపారు.

భారత్‌లో అత్యధిక మధుమేహ కేసులు

2022 గణాంకాలు వెల్లడించిన లాన్సెట్

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా 2022లో నమోదైన మొత్తం 82.8 కోట్ల మధుమేహం కేసుల్లో నాలుగో వంతుకు పైగా భారత్‌లో నమోదయ్యాయని లాన్సెట్ నివేదిక వెల్లడించింది. ఎన్‌సీడీ రిస్క్ ఫ్యాక్టర్ కొలాబొరేషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించిన అధ్యయన నివేదిక ఇటీవల లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమైంది. 14.1 కోట్ల వయోజనులను సర్వే చేసిన 1108 జనాభా ఆధారిత అధ్యయనాలను విశ్లేషించి ఈ నివేదిక రూపొందించారు. ఈ నివేదిక ప్రకారం భారత్‌లో 62 శాతం డయాబెటిస్ రోగులు ఎలాంటి చికిత్సను పొందడం లేదు. భారత్ జనాభాలో సుమారు 23.7 శాతం(21.2 కోట్లు) మంది 2022లో డయాబెటిస్‌తో బాధ పడుతున్నారు. గత మూడు దశాబ్దాల్లో భారత్‌తో సహా తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లో మధుమేహ రోగుల సంఖ్య వేగంగా పెరిగింది.

ధనిక దేశాలను వెతుక్కుంటూ..!

- 2022లో భారత్‌ను వీడిన 5.6 లక్షల మంది
- 2021 ఏడాది కంటే ఇది 35 శాతం అధికం
- డ్రీమ్ డెస్టినేషన్‌గా అమెరికా, కెనడా, యూకే

ముంబై, నవంబర్ 15: స్వదేశాన్ని వీడి విదేశాల్లో స్థిరపడుతున్న భారతీయుల సంఖ్య పెరుగుతున్నది. గురువారం పారిస్‌లో విడుదల చేసిన ఇంటర్నేషనల్ మైగ్రేషన్ ఔట్‌లుక్ 2024లో కీలక విషయాలు వెల్లడయ్యాయి. 2022లో 5.6 లక్షల మంది భారతీయులు దేశాన్ని వదిలి అమెరికా, యూకే, కెనడా వంటి ఆర్గనైజేషన్ ఆఫ్ ఎకనమిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్(ఓఈసీడీ) సభ్య దేశాల్లో స్థిరపడ్డారు. 2021లో 4.11 లక్షల మంది భారతీయులు ఓసీఈడీ దేశాలకు వలస వెళ్లగా, 2022లో ఈ సంఖ్య 35 శాతం అధికంగా ఉంది. భారతీయుల తర్వాత చైనీయులు(3.2 లక్షల మంది) ఉన్నారు. 2022లో కొత్తగా వలసవెళ్లిన విదేశీయుల్లో భారతీయులే 6.4 శాతం ఉన్నారు. 2022లో అమెరికాకు అత్యధికంగా 1.25 లక్షల మంది, కెనడాకు 1.18 లక్షల మంది, యూకేకు 1.12 లక్షల మంది వలసవెళ్లారు.

పౌరసత్వాన్ని వదులుకున్న 1.9 లక్షల మంది

2022లో దాదాపు 1.9 లక్షల మంది భారతీయులు దేశ పౌరసత్వాన్ని వదులుకొని ఓఈసీడీ దేశాల పౌరసత్వాన్ని తీసుకున్నారు. ఇది 2021తో పోలిస్తే 40 శాతం అధికం. ఓఈసీడీల్లో పౌరసత్వం పొందిన విదేశీయుల్లో భారతీయులే అధికం.

ఓఈసీడీ దేశాలకు వలస వెళ్లిన విదేశీయులు (లక్షల్లో)

దేశం	2021	2022
భారత్	4.11	5.57
చైనా	2.90	3.26
రష్యా	1.12	2.68
రొమేనియా	2.47	2.68
కొలంబియా	1.02	2.18

ఓఈసీడీ దేశాల పౌరసత్వం పొందిన వారు

దేశం	2021	2022
భారత్	1,32,908	1,90,299
సిరియా	1,04,570	1,33,551
మొరాకో	91,222	1,20,621
మెక్సికో	1,18,147	1,12,668
ఫిలిప్పీన్స్	87,331	1,11,424

భారమవుతున్న విదేశీ విద్య

న్యూఢిల్లీ, నవంబర్ 15: ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాలనుకునే వారికి అమెరికా చాలా కాలం నుంచి అత్యంత ప్రధాన గమ్యస్థానంగా కొనసాగుతున్నది. ఏటా ప్రపంచ దేశాల నుంచి అగ్రరాజ్యం అత్యధిక సంఖ్యలో విద్యార్థులను ఆకర్షిస్తున్నది. కానీ, అమెరికాతోపాటు పలు ఇతర దేశాల్లోని విద్యాసంస్థల్లో ఫీజులు ఏటేటా గణనీయంగా పెరుగుతుండటం విదేశీ విద్యార్థులను కలవరపెడుతున్నది. వారు ఎంచుకునే యూనివర్సిటీలు, కోర్సులను బట్టి ఈ ఫీజులు ఆధారపడి ఉంటాయి. ప్రైవేట్ విద్యాసంస్థల కంటే ప్రభుత్వ యూనివర్సిటీల్లో తక్కువ ఫీజులు వసూలు చేస్తారు. మెడిసిన్, ఇంజినీరింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్ లాంటి కోర్సుల కంటే హ్యూమానిటీస్, ఎడ్యుకేషన్, ఆర్ట్స్ కోర్సుల ఫీజులు తక్కువ.

- ఐదారేండ్ల క్రితం అమెరికాలోని యూనివర్సిటీల్లో ట్యూషన్, ఇతర ఫీజులు కలిపి ఏటా సగటున 9,716 నుంచి 35,676 డాలర్ల (దాదాపు రూ.8.20 లక్షల నుంచి రూ.30.12 లక్షల) వరకు చెల్లించాల్సి వచ్చేది. కానీ, గత కొన్నేండ్లుగా ఈ ఫీజులు మరింత పెరగడంతో ప్రస్తుతం విదేశీ విద్యార్థులు ఏటా 25 వేల నుంచి 55 వేల డాలర్ల (దాదాపు రూ.22 లక్షల నుంచి రూ.47 లక్షల) వరకు చెల్లించాల్సి వస్తున్నది.

అమెరికా, బ్రిటన్‌లో భారీగా పెరిగిన ఫీజులు

- బ్రిటన్‌లోనూ విద్యా ఖర్చులు పెరిగాయి. ప్రస్తుతం అక్కడ ఏటా దేశీయ విద్యార్థులతోపాటు యూరోపియన్ యూనియన్ విద్యార్థుల నుంచి 9,250 పౌండ్లు (దాదాపు రూ.9.27 లక్షలు), ఇతర దేశాల విద్యార్థుల నుంచి 10 వేల పౌండ్లు (దాదాపు రూ.10.02 లక్షలు), మెడిసిన్ తదితర స్పెషలైజ్డ్ డిగ్రీ కోర్సులకైతే దాదాపు 38 వేల పౌండ్లు (రూ.38.10 లక్షలు) వసూలు చేస్తున్నారు. కానీ, అమెరికా లాంటి దేశాలతో పోలిస్తే బ్రిటన్‌లో విదేశీ విద్యార్థుల జీవన వ్యయం తక్కువ. అంతే కాకుండా బ్రిటన్‌లో చాలా యూనివర్సిటీలు స్వల్పవ్యవధితో కూడిన ప్రోగ్రామ్‌లను ఆఫర్ చేస్తున్నాయి. దీంతో అక్కడ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులను నాలుగేండ్లకు బదులుగా మూడేండ్లలో, మాస్టర్స్ డిగ్రీ కోర్సులను రెండేండ్లకు బదులుగా ఏడాదిలో పూర్తి చేసుకునే వీలుంటుంది.

కశ్మీర్‌పై చర్చ.. ఆక్స్‌ఫర్డ్‌లో భారత విద్యార్థుల నిరసన

కశ్మీర్ అంశంపై చర్చా వేదికను నిర్వహించడాన్ని నిరసిస్తూ యూకేలోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో భారత విద్యార్థులు గురువారం నిరసన ప్రదర్శన చేశారు. చర్చా వేదికను ఆపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ వేదిక ప్యానల్‌లోని కొందరు వ్యక్తులు విద్వేష ప్రసంగీకులని వారు ఆరోపించారు. వారిలో కొంతమందికి ఉగ్రవాదులతో ఉన్న సంబంధాలపై దర్యాప్తు జరుగుతున్నదన్నారు. ఈ సందర్భంగా ఒక వర్గం వారు కశ్మీర్‌లోని హిందువులను భయపెట్టి వారు ఎలా అక్కడి నుంచి పారిపోయేలా చేశారో విద్యార్థులు వివరించారు.

మాస్టర్స్ 'స్కామ్'లో భారతీయ విద్యార్థులు

రెడిట్‌లో అమెరికన్ యువతి కామెంట్స్‌పై చర్చ

న్యూఢిల్లీ: అమెరికాలో మాస్టర్స్ చేయడానికి వెళ్లే భారతీయ విద్యార్థులను ఉద్దేశించి ఓ అమెరికన్ యువతి(26) చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. 'నా తరగతిలో 99 శాతం మంది విద్యార్థులు భారతీయులే. అమెరికా వీసా, ఉద్యోగం కోసమే మాస్టర్స్ చేస్తున్నట్టు వారు చెప్తున్నారు. ఏదో 'స్కామ్'లో భారతీయ విద్యార్థులు చిక్కుకుంటున్నట్టు అనిపిస్తున్నది. వీరంతా అప్పులు చేసి వస్తున్నారు. అమెరికన్లకే ఉద్యోగాలు దొరకడం కష్టమవుతున్నందున వీరికి ఉద్యోగాలు దొరకడం చాలా కష్టం. పైగా క్లాస్‌రూమ్‌లో ప్రొఫెసర్ ఉన్నప్పుడు భారతీయ విద్యార్థులు గట్టిగా మాట్లాడుకుంటారు' అంటూ ఆమె రెడిట్‌లో పోస్ట్ చేశారు. ఆమె వ్యాఖ్యలను సమర్థిస్తూ కొందరు, వ్యతిరేకిస్తూ ఇంకొందరు కామెంట్స్ చేస్తున్నారు.

ఉద్యోగం మానేయాలని భార్యను నిర్బంధించడం క్రూరత్వమే

మధ్యప్రదేశ్ హైకోర్టు

ఇండోర్: ఉద్యోగం మానేయాలని, తన ఆకాంక్షలకు అనుగుణంగా బతకాలని భార్యను భర్త నిర్బంధించడం క్రూరత్వమేనని మధ్యప్రదేశ్ హైకోర్టు చెప్పింది. కేంద్ర ప్రభుత్వ సంస్థలో మేనేజర్‌గా పని చేస్తున్న మహిళ (33) విడాకుల కోసం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. ఆమె పిటిషన్‌ను కుటుంబ న్యాయస్థానం తిరస్కరించడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఉద్యోగం మానేసి, భోపాల్‌లో తనతోపాటు కాపురం చేయాలని తన భర్త తనను మానసికంగా వేధిస్తున్నారని ఆమె ఆరోపించారు. హైకోర్టు స్పందిస్తూ చేస్తున్న ఉద్యోగాన్ని మానేయాలని భర్త కానీ, భార్య కానీ ఒకరిపై మరొకరు ఒత్తిడి తేకూడదని స్పష్టం చేసింది.

మైనర్ భార్యతో శృంగారం అత్యాచారమే

బాంబే హైకోర్టు నాగపూర్ బెంచ్ సంచలన తీర్పు

ముంబై, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): మైనర్ భార్యతో శృంగారంలో పాల్గొనడం అత్యాచారం కిందకే వస్తుందని బాంబే హైకోర్టు నాగపూర్ బెంచ్ తీర్పు చెప్పింది. శృంగారానికి అంగీకారం తెలిపేందుకు కనీస వయసు 18 ఏండ్లు ఉండాలని పేర్కొన్నది. మహారాష్ట్రలోని వార్ధాకు చెందిన ఓ వ్యక్తి(24)పై మైనర్ అయిన అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసులో సెషన్స్ కోర్టు అతడికి పదేండ్ల జైలు శిక్ష విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సదరు వ్యక్తి బాంబే హైకోర్టును ఆశ్రయించాడు.

కాల్పుల విరమణకు హమాస్ సిద్ధం

ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తేవాలని ట్రంప్‌కు వినతి

గాజా: ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణకు సిద్ధమేనని హమాస్ పొలిటికల్ బ్యూరో సభ్యుడు బస్సెమ్ నయీమ్ శుక్రవారం చెప్పారు. దాడులకు ముగింపు పలికే విధంగా ఇజ్రాయెల్‌పై అమెరికా ప్రెసిడెంట్ ఎలక్ట్ డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి తేవాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు.

53 కోట్లు ఇస్తే ఈవీఎంలు హ్యాక్ చేస్తా

ఓ ఎంపీకి సయ్యద్ షుజా అనే వ్యక్తి ప్రతిపాదన

ముంబై, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపించిన వేళ ఈవీఎంలను హ్యాక్ చేస్తానని సంప్రదింపులు జరుపుతూ ఓ వ్యక్తి అలజడి సృష్టించాడు. తనను సైబర్ నిపుణుడిగా చెప్పుకున్న సయ్యద్ షుజా అనే వ్యక్తి మహా వికాస్ అఘాడీకి చెందిన ఓ ఎంపీని సంప్రదించాడు. రూ.53 కోట్లు ఇస్తే 63 నియోజకవర్గాల్లో ఈవీఎంలను హ్యాక్ చేసి గెలిపిస్తానని ఆఫర్ ఇచ్చాడు. తాను అమెరికా రక్షణ శాఖలో కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నానని, అక్కడి సాంకేతికత సాయంతో ఈవీఎంలను హ్యాక్ చేస్తానని చెప్పాడు. సయ్యద్ షుజాతో ఎంపీ పీఏగా చెబుతూ ఇండియా టుడే చానల్ ప్రతినిధి వీడియో కాల్ మాట్లాడాడు. తనకు ఏయే అభ్యర్థులను గెలిపించాలో పేర్లు చెప్తే.. ఈవీఎంలు హ్యాక్ చేసి గెలిపిస్తానని అతడు చెప్పాడు. ఇందుకోసం వీవీపాట్‌ల వివరాలు కావాలని చెప్పుకొచ్చాడు. ఈ ఘటనపై సదరు ఎంపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పౌరుల గోప్యతకు ముప్పు!

- కొత్త సైబర్ సెక్యూరిటీ నిబంధనలపై అభ్యంతరాలు
- యూజర్ల డాటాపై ప్రభుత్వానికి అధికారాలు
- రాజ్యాంగ సూత్రాలకు వ్యతిరేకం: న్యాయ నిపుణులు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ టెలికమ్యూనికేషన్ల విభాగం(డీఓటీ) తీసుకురానున్న నూతన సైబర్ భద్రత నిబంధనల పట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిబంధనలు వినియోగదారుల డాటాపై ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో అధికారాలు కల్పిస్తున్నాయని, వ్యక్తిగత గోప్యతకు ఇది భంగకరమని, రాజ్యాంగ సూత్రాలకు వ్యతిరేకమని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సైబర్ భద్రతను పటిష్ఠం చేసేందుకు రూపొందించిన సైబర్ సెక్యూరిటీ రూల్స్ ముసాయిదాను ఆగస్టు 28న డీఓటీ ప్రకటించింది. 30 రోజుల గడువు ఇచ్చి అభిప్రాయాలు సేకరించింది. టెలికం సంస్థలు, న్యాయ నిపుణులు ఈ నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్టు తెలుస్తున్నది. సైబర్ భద్రత కోసం ప్రభుత్వం టెలికం సంస్థల నుంచి వినియోగదారుల సమాచారాన్ని సేకరించేలా కొత్త నిబంధనలు అధికారం కల్పిస్తున్నాయి. ఇప్పుడు జాతీయ భద్రతకు సంబంధించిన విషయాల్లో మాత్రమే ఇలా డాటాను పొందేందుకు ప్రభుత్వానికి చట్టాలు వీలు కల్పిస్తున్నాయని ఇండస్‌లా సంస్థ భాగస్వామి శ్రేయ సూరి చెప్పారు. కొత్త నిబంధనలు మాత్రం వ్యక్తిగత డాటాను పూర్తిస్థాయిలో పొందే అధికారం ప్రభుత్వానికి కల్పిస్తున్నాయని, ఇది డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ యాక్ట్(డీపీడీపీ చట్టం)తో పాటు రాజ్యాంగ సూత్రాలకు వ్యతిరేకమని ఆమె అభిప్రాయపడ్డారు.

కెనడా మాదే, మీరు యూరప్ వెళ్లిపొండి

కెనడియన్లకు ఖలిస్థానీల హెచ్చరిక

న్యూఢిల్లీ: కెనడాలోని ఖలిస్థానీలు శ్వేత జాతీయులను హెచ్చరిస్తున్నారు. సర్రే ప్రాంతంలో జరిగిన నగర కీర్తన ప్రదర్శనలో పాల్గొన్న ఓ ఖలిస్థాన్ అనుకూలవాది ఓ వీడియో క్లిప్‌లో కెనడియన్లను దురాక్రమణదారులుగా పేర్కొన్నాడు. కెనడా యజమానులము తామేనని చెప్పాడు. ''ఇది మా దేశం. మేం కెనడా యజమానులం. మేం గొప్ప కెనడియన్లం. మీరు తిరిగి యూరప్ లేదా ఇంగ్లండ్‌కు వెళ్లిపొండి. మీరు కెనడియన్లు కాదు. మేమే కెనడియన్లం. మీరు దురాక్రమణదారులు. శ్వేత జాతీయులారా తిరిగి యూరప్‌నకు వెళ్లిపొండి'' అని హెచ్చరించాడు.

రైలులో రీల్స్ చేస్తే కేసే!

ఉత్తర్వులు జారీ చేసిన రైల్వే బోర్డు

న్యూఢిల్లీ, నవంబర్ 15: రైళ్లు, రైల్వే ప్లాట్‌ఫాంలు, మెట్రో రైళ్లలో రీల్స్ చేస్తూ ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్న వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించనుంది. అలాంటి వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రైల్వే బోర్డు అన్ని జోన్లకు ఆదేశాలు జారీ చేసింది. వారు కోచ్‌లో కానీ, రైల్వే ప్రాంగణంలో కానీ రైల్వే కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని తమ ఆదేశంలో పేర్కొంది. కొంతమంది ప్రమాదాలను సైతం లెక్క చేయకుండా వ్యూస్ కోసం డ్యాన్స్‌లు, ప్రమాదకర స్టంట్‌లతో రీల్స్ చేస్తున్నారు. అవి తోటి ప్రయాణికులను చాలా ఇబ్బంది పెడుతున్నాయి. దీనిపై పలువురు ఫిర్యాదులు కూడా చేస్తున్నారు. ఇటీవల రైల్వే ట్రాక్‌పై ఆగిపోయిన ఒక ఎస్‌యూవీ వాహనాన్ని చూసిన గూడ్స్ డ్రైవర్ అప్రమత్తమై రైలును నిలిపివేశాడు. తీరా అది ప్రమాదవశాత్తు ఆగిపోలేదని, ఒక స్టంట్‌కు సంబంధించి రీల్ కోసం దానిని ట్రాక్‌పై ఆపినట్టు తెలుసుకున్నారు. ఇలాంటివి దేశ వ్యాప్తంగా అనేక ఘటనలు వెలుగు చూస్తున్నాయి.

తెరుచుకున్న శబరిమల ఆలయం

తిరువనంతపురం, నవంబర్ 15: కేరళలోని శబరిమల అయ్యప్ప స్వామి ఆలయం తెరుచుకుంది. రెండు నెలల పాటు జరిగే మండల-మకర విళక్కు వార్షిక పూజల కోసం శుక్రవారం నుంచి ఆలయాన్ని తెరిచారు. మకరజ్యోతి దర్శనం అయ్యే 2025 జనవరి 15 వరకు ఆలయాన్ని భక్తుల కోసం తెరచి ఉంచుతారు. తెల్లవారుజామున 4 గంటలకు గుడి ద్వారాలను తెరచి దర్శనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయ ప్రధాన పూజారులుగా ఎస్ అరుణ్ కుమార్ నంబూద్రి, వాసుదేవన్ నంబూద్రి బాధ్యతలు స్వీకరించారు. అయ్యప్పస్వామి దర్శనానికి తెలంగాణ, ఏపీతోపాటు తమిళనాడు, కర్ణాటక, రాష్ట్రాల నుంచి పెద్దయెత్తున భక్తులు తరలివచ్చారు. ప్రతి రోజు వర్చువల్ క్యూ పద్ధతి ద్వారా 70 వేలు, స్పాట్ బుకింగ్ ద్వారా 10 వేల మంది భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు.

ఢిల్లీలో 900 కోట్ల డ్రగ్స్ పట్టివేత

గుజరాత్‌లో 700 కిలోల డ్రగ్స్ స్వాధీనం

న్యూఢిల్లీ, నవంబర్ 15: దేశ రాజధాని న్యూఢిల్లీలో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. రూ.900 కోట్ల విలువైన 90 కిలోల కొకైన్‌ను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. న్యూఢిల్లీలోని నాంగ్లోయ్, పశ్చిమ ఢిల్లీలో ఆస్ట్రేలియా నుంచి వచ్చిన 82 కిలోల కొకైన్‌ను ఎన్సీబీ కొరియర్ ఆఫీస్‌లో పట్టుకుంది. దీన్ని తెప్పించిన డ్రగ్ సిండికేట్‌కు విదేశాలతో సంబంధాలు ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఢిల్లీ, సోనిపట్‌లకు చెందిన కొందరు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ ఏడాది అక్టోబర్‌లో కూడా సుమారు రూ.5,620 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను ఢిల్లీలో పట్టుకున్నారు.

8 మంది ఇరానియన్ల అరెస్ట్

డ్రగ్స్ నిరోధక సంస్థలు శుక్రవారం గుజరాత్ తీరంలో సంయుక్త ఆపరేషన్ నిర్వహించి 700 కిలోల మాదక ద్రవ్యాలను సీజ్ చేసి, 8 మంది ఇరానియన్లను అరెస్ట్ చేశాయి. భారత నేవీ భారత ప్రాదేశిక జలాల్లోని ఒక నౌకలో సోదాలు నిర్వహించి, అందులోని 700 కిలోల మెటాంఫెటమైన్‌ను సీజ్ చేసింది.

దున్నపోతు ఖరీదు 23 కోట్లు!

రోజూ ప్రత్యేక మెనూ.. విలాసవంత జీవనం

ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న హర్యానా 'అన్మోల్'

చండీగఢ్: హర్యానాకు చెందిన రూ.23 కోట్ల విలువైన దున్నపోతు దేశంలో జరిగే వ్యవసాయ ప్రదర్శనల్లో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నది. 1,500 కిలోల బరువుండే అన్మోల్ పేరు గల ఈ దున్న తన ఉత్తమ జాతికి, భారీ కాయానికి, పునరుత్పత్తి సామర్థ్యానికి ప్రసిద్ధి చెందింది. విలాసవంతమైన జీవన శైలి కలిగిన ఈ దున్న రోజువారీ ఆహారం ఖర్చు సుమారు రూ.1500. ఇది రోజూ పావు కిలో బాదం, 30 అరటి పండ్లు, నాలుగు కిలోల దానిమ్మ, 5 లీటర్ల పాలు, 20 గుడ్లు లాగించేస్తుంది. రోజూ బాదం నూనె, ఆవ నూనెతో శరీరాన్ని మర్దన చేయడంతో ఇది ఎల్లప్పుడూ నిగనిగలాడుతూ, ఆరోగ్యంగా ఉంటుంది. ఈ దున్నను పోషించడం కోసం దీని యజమాని గిల్ రోజుకు 25 లీటర్ల పాలిచ్చే దీని తల్లిని, సోదరిని అమ్మేశారు. ఆకట్టుకొనే ఆకారం, ఆహారం తీసుకొనే ఈ దున్నపోతు వీర్యానికి భారీగా డిమాండ్ ఉంది. వారానికి రెండు సార్లు దీని వీర్యాన్ని సేకరిస్తారు. దీని ద్వారా నెలకు 5 లక్షల వరకు ఆదాయం వస్తుంది.

పిల్లి సంపద 840 కోట్లు!

న్యూఢిల్లీ, నవంబర్ 15: ఈ చిత్రంలోని పిల్లి పేరు నల. ఇది ప్రపంచంలోనే అత్యంత సంపన్న మార్జాలం. దీనికి ఇన్‌స్టాలో 45 లక్షల మంది ఫాలోవర్లు కూడా ఉన్నారంటే దీని క్రేజ్ అర్థం చేసుకోవచ్చు. అతి ఎక్కువ సంఖ్యలో ఇన్‌స్టాలో ఫాలోవర్లు ఉన్న పిల్లిగా గిన్నిస్ ప్రపంచ రికార్డును కూడా సొంతం చేసుకుంది. దాని ఇన్‌స్టా పేజీ అంతా మనోహరమైన దాని ఫొటోలు, రీల్స్‌తో నిండి ఉంటుంది. క్యాట్స్.కామ్ వెబ్‌సైట్ ప్రకారం దీని నికర సంపద సుమారు 100 బిలియన్ డాలర్లు. మన కరెన్సీలో అక్షరాలా రూ.840 కోట్లు. ఒక జంతు సంరక్షణ కేంద్రంలో ఉన్న ఈ పిల్లిని వరిసిరి మేతా చిట్టిపాన్ అనే మహిళ చూసింది. దాని చిట్టి కండ్లు, ముద్దొచ్చే ముఖం చూసి మురిసిపోయిన ఆమె దానిని దత్తత తీసుకుంది. తర్వాత నల అనేక వ్యాపార ప్రకటనలతో వాణిజ్య ప్రపంచంలో కూడా అడుగుపెట్టింది. ద లయన్ కింగ్ చిత్రంలో సింబా ప్రాణస్నేహితుని పేరు నలతో ఈ పిల్లి ప్రసిద్ధి చెందింది.

40 నిమిషాల్లోనే ఢిల్లీ టు శాన్‌ఫ్రాన్సిస్కో

స్పేస్‌ఎక్స్ స్టార్‌షిప్‌తో ప్రయాణించే అవకాశం

సాధ్యం చేసే ప్రయత్నాల్లో మస్క్

న్యూయార్క్, నవంబర్ 15: వ్యోమనౌక అంటే వ్యోమగాములను అంతరిక్షంలోకి తీసుకెళ్లేది అనే అర్థం మారే అవకాశం ఉన్నది. వ్యోమనౌకను సూపర్‌ఫాస్ట్ విమానంగా వినియోగించేందుకు స్పేస్‌ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్ కొత్త ప్రణాళికలు రచిస్తున్నట్టు తెలుస్తున్నది. ప్రపంచంలోని ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించాలని మస్క్ భావిస్తున్నారట. తన స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన స్టార్‌షిప్ వ్యోమనౌక ద్వారా అంగారకుడిపైకి మనుషులను పంపించాలని ఇంతకాలంగా మస్క్ ప్రణాళిక. అయితే, భూమిపై మనుషుల ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు స్టార్‌షిప్‌ను వినియోగించాలని మస్క్ వ్యూహాలు రచిస్తున్నట్టు ఒక కథనం వెలువడింది. స్టార్‌షిప్ ద్వారా సాధారణ విమాన ప్రయాణ దూరాన్ని దాదాపు 2,200 శాతం తగ్గించొచ్చని మస్క్ భావిస్తున్నట్టు 'యూనిలాడ్ టెక్' వార్తాసంస్థ పేర్కొన్నది.

గంటకు 27 వేల కిలోమీటర్ల వేగం..

మొదట అమెరికాలోని న్యూయార్క్ నుంచి చైనాలోని షాంఘై మధ్య స్టార్‌షిప్‌ను నడిపించాలని మస్క్